జారెను మెజార్టీతో గెలిపించండి


ప్రచారంలో మాట్లాడుతున్న పొంగులేటి మాధురి రెడ్డి, పక్కన అభ్యర్థి జారె ఆదినారాయణ

దమ్మపేట: మంచితనం, సేవాభావం ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురిరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రోడ్ షో కార్యక్రమంలో జారేకు మద్దతుగా మాధురిరెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అంతకుముందుగా జారేను గెలిపించాలని కోరుతూ, దమ్మపేట గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దమ్మపేట గ్రామంలో ప్రచార రథంపై జారేతో పాటుగా ప్రజలకు అభివాదం చేస్తూ, మాట్లాడుతూ.. దమ్మపేట మండలానికి ప్రధాన సమస్యలు అయిన ఆర్టీసీ బస్సుల రాకపోకలు, 30 పడకల ఆస్పత్రి తదితర సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జారే ఆధ్వర్యంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టిందని ఎద్దేవా చేశారు.

ప్రజలు కోరే పాలన అందిస్తా: జారె

ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే, నియోజకవర్గంలోని ప్రజలు కోరుకునే స్వచ్ఛమైన పరిపాలనను అందించడానికి తన శక్తి మేరకు కృషి చేస్తానని జారే ఆదినారాయణ వెల్లడించారు. రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా నియోజకవర్గంలోని ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగుతున్నాయని, ఏరోజూ తాను వ్యక్తిగత విభేదాలు, సామాజిక తారతమ్యాలకు పోకుండా, పలు సేవా కార్యక్రమాలు చేశానని తెలిపారు. అర్హులు అందరికీ రేషన్ కార్డులు ఇవ్వలేని బీఆర్ఎస్ ప్రభుత్వం, మళ్లీ అధికారంలో వస్తే సన్న బియ్యం ఇస్తుందా అని ప్రశ్నించారు. నాయకులు కోటగిరి సత్యం బాబు, రావు గంగాధరరావు, కోటగిరి సత్యావతి, చిన్నశెట్టి యుగంధర్, మద్దిశెట్టి సత్యప్రసాద్, కక్కిరాల రమేష్, అత్తులూరి వెంకటరామారావు, పానుగంటి సత్యం, యర్రగొర్ల రాధకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ సర్పంచ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కంగాల పరమేష్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ కార్యదర్శి ఆకుల శ్రీను కలిసి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి జారే ఆదినారాయణ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ జెండా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



భద్రాచలం: మసీదు వద్ద ముస్లింలతో మాట్లాడుతున్న పొదెం వీరయ్య


దుమ్ముగూడెం: పార్టీలో చేరిన సర్పంచ్‌కు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలం: తెలంగాణలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, భద్రాచలం అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ భద్రాచలం అభ్యర్థి పొదెం వీరయ్య అన్నారు. శుక్రవారం పొదెం వీరయ్య తన కార్యకర్తలు, నాయకులతో పట్టణంలో పలు చోట్ల ఎన్నికల ప్రచారం జరిపారు. వాడవాడలా ప్రజలను కలుసుకుంటూ, పలుకరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. మసీద్‌కు వెళ్లి ముస్లింలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. భద్రాచలం ప్రజలకు వరద, కోవిడ్, ఇతర కష్టసమయాలలో అందుబాటులో ఉండి చేసిన సేవలను గుర్తు చేశారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం ఇండిపెండెంట్ సర్పంచ్ తెల్లం కృష్ణవేణి శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఆమెకు ఎమ్మెల్యే వీరయ్య పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లంక అబ్బులు, నాయకులు బత్తుల శోభన్ బాబు, కుంజా శ్రీను, తెల్లం వెంకటేష్, గంగోలు సర్పంచ్ మడకం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతీ కార్యక్రమానికి ప్రజెంట్ !

కరకగూడెం: ప్రస్తుతం ఎక్కడ చూసిన ఎన్నికల హడావుడే కన్పిస్తోంది. ఈ క్రమంలో పోటీలో ఉన్న అభ్యర్థులు నిత్యం జనాల్లోకి వెళ్లేలా ప్రణాళికలు రూపొందించుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. అందులో భాగంగా పెళ్లిళ్లు, ఫంక్షన్‌లలో పాల్గొని అక్షింతలు వేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని, మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. అదీ ఇదీ అని లేకుండా ప్రజలకు చేరువయ్యే అన్ని కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఆయా కార్యక్రమాలకు వారిని పిలిచినా పిలవకపోయిన అభ్యర్థులు పాల్గొని.. తద్వారా తమకు ఎన్నికల్లో కలిసివస్తుందని లెక్కలేసుకుంటున్నారు. సంతోష కార్యక్రమాల్లో సందడి చేస్తునే, విషాద ఘటనలో ఓదార్పుల జోరును స్థానిక నాయకులతో కలిసి పెంచుతున్నారు. ఇదీ చూసిన జనం ఎన్నికలప్పుడు ఎలా ఉండాలో రాజకీయ నాయకులకు తెలిసినంత ఎవరికీ తెలియదని అభిప్రాయపడుతున్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఓడించండి..

గుండాల: మండల పరిధిలోని బాటన్న నగర్ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో శుక్రవారం గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా డివిజన్ నాయకులు బోర్ర వెంకన్న, ఈసం చంద్రన్న, పూనెం మంగయ్య, యనగంటి గణేష్ లు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతూ ప్రశ్నించే గొంతుకలను, పత్రికలను, ఎదిరించే రచయితలను జైలుపాలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఎన్నికల్లో చిత్తు, చిత్తుగా ఓడించాలని సూచించారు. నాయకులు మోకాళ్ల ఆజాద్, కుంజ రమేష్, మడకం లాలయ్య, మడకం కిరణ్, పూకె రామ్లాల్, మడకం నందయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

అశ్వాపురం: డెంగీ జ్వరంతో బాధపడుతూ మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన గుర్రం కన్నమ్మను శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి వల్లెపోగు రాము తదితరులు పాల్గొన్నారు.

పార్టీల విస్తృత ప్రచారం

అన్నపురెడ్డిపల్లి: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం సీపీఎం అభ్యర్థి పిట్టల అర్జున్ ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్, మండల కార్యదర్శి వెంకటరత్నం, రాంచరణ్, ఆదినారాయణ, కోటయ్య, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారసభను నిర్వహించగా.. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడారు. తమ అభ్యర్థి పిట్టల అర్జునరావును గెలిపించాల్సిందిగా కోరారు. అనంతరం మండలవ్యాప్తంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొండపల్లి శ్రీధర్, ఐలూరి రామిరెడ్డి, పెద్దిని వేణు, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటాచారి పాల్గొన్నారు.

అశ్వాపురం: బీజేపీ పినపాక నియోజకవర్గ అభ్యర్థి పొడియం బాలరాజు గెలుపు కోరుతూ ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బాలరాజును గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, నాయకులు సురకంటి లింగారెడ్డి, కల్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ నిర్మిస్తా..

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావును గెలిపిస్తే, దమ్మపేట మండలంలో జూనియర్ కాలేజీని, తన సొంత నిధులతో నిర్మించి ఇస్తానని రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధి రెడ్డి ప్రకటించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల వెంకటరమణ, రావు జోశ్వరరావు, పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని ఎమ్మెల్యే అశ్వారావుపేట బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు బాణోత్ పద్మావతి, భూక్యా ప్రసాద్, సున్నం నాగమణి, వగ్గెల పూజ, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టమే గెలిపిస్తుంది..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని చందర్‌రావు భవన్‌లో జరిగిన సీపీఎం భద్రాచలం పట్టణ పార్టీ సభ్యుల విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వమించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ.. సీపీఎం కార్యకర్తల కష్టమే పార్టీ అభ్యర్థిని కారం పుల్లయ్యను గెలిపిస్తుందని అన్నారు. సమావేశానికి పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత వహించగా రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీ ఆధ్వర్యంలో సభ..

గుండాల: ప్రజా సమస్యలను పక్కన పెట్టిన పాలకవర్గ పార్టీలను ఓడించి ప్రజల కోసం పనిచేసే అభ్యర్థులను గెలిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోవర్ధన్, బండారి ఐలయ్య, ఆవునూరి మధులు అన్నారు. మండల కేంద్రంలో న్యూడెమోక్రసీ అభ్యర్థి ఈసం కృష్ణ గెలుపును కాంక్షిస్తూ మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ ముక్తి సత్యం అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, జెడ్పీటీసీ రామక్క, సర్పంచ్ సీతారాములు, ఎంపీటీసీ కృష్ణవేణి పాల్గొన్నారు.

నక్సలైట్ల వ్యవస్థను నిర్మూలిద్దాం

కరకగూడెం: నక్సలైట్ల వ్యవస్థను నిర్మూలించి బంగారు భవిత్‌ను నిర్మిద్దామని కరకగూడెం ఎస్సై రాజరాం పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మావోయిస్టు యాక్షన్ టీం సభ్యుల పోస్టర్లను జనసముదాయాలు అధికంగా ఉండే ప్రధాన కూడళ్ల వద్ద అతికించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదరు పోస్టర్లలోని నిషేధిత మావోయిస్టుల సమాచారం ఎవరికైనా తెలిస్తే పోలీసులకు తెలిపి బహుమతులను పొందాలని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్ వద్ద ఎస్సై, సిబ్బంది

అసమర్థులకు అధికారమిస్తే అంధకారమే..


బూర్గంపాడు: సారపాక ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

బూర్గంపాడు: అసమర్థులకు అధికారమిస్తే రాష్ట్రం మళ్లీ అంధకారంలోకి వెళ్తుందని పినపాక అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. ఐటీసీ పీఎస్‌పీడీ వద్ద కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. సారపాక నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటార్‌సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. టాయా గ్రామాల్లోని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాలలో పురోగతి సాధించిందన్నారు. మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను గెలిపించుకుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. కారు గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాల్సిందిగా కోరారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పొడియం ముత్యాలమ్మ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

మణుగూరురూరల్: మండలంలోని కటుమల్లారం, గనిబోయిన గుంపు ప్రాంతాలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి రేగా కాంతారావు గులాభి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

రేగాను గెలిపించాలి

పినపాక నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే జరగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ వజ్జా నర్సింహరావు, పినపాక నియోజకవర్గ కన్వీనర్ మడి శంకర్‌లు కోరారు. శుక్రవారం పట్టణంలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. రేగా ఆధ్వరంయలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు కుంజా వెంకటరమణ, తాటి సమ్మయ్య, కొమరం సైదులు, గొగ్గలి రామకృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, వీరయ్య, కృష్ణయ్య, రవి, రాంబాబు, రాజశేఖర్, శాంతమ్మ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

ఎన్నికల్లో పినపాక నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ.. మండల పరిధిలోని గ్రామాలు, మణుగురు మున్సిపాలిటీ వార్డుల్లో గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముత్యాలమ్మనగర్ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో సర్పంచ్ కొమరం జంపేశ్వరి మాట్లాడారు.

ఎన్నికల్లో పాయంను గెలిపించాలి


గుండాల: సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు


అశ్వాపురం: జామా మసీదు వద్ద ప్రచారంలో ఎంపీపీ సుజాత, కాంగ్రెస్ నాయకులు

గుండాల: వేల ఎకరాల్లో ట్రంచ్‌లు కొట్టిచ్చి, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఓట్లు దండుకోవడానికి వచ్చే పాలక వర్గ నాయకులను ఓడించాలని, హస్తం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో పినపాకలో పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ, టీజెఎస్ గుండాల మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు కొడెం ముత్యంచారి, వాగబోయిన రమేశ్, తోలెం సాంబయ్య, గొల్లపల్లి రమేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మండల నాయకులు పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లను విమర్శించడం సరైంది కాదన్నారు. హరితహారం పేరుతో వేల ఎకరాల్లో ట్రంచులు కొట్టి దాదాపు 20 సవంత్సరాలుగా సాగు చేసుకుంటున్న అమాయక పోడు రైతుల మీద కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత కేవలం రేగ కాంతారావుకు మాత్రమే దక్కుతుందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ కల్తీ కృష్ణారావు, ఈసం పాపారావు,పాంబోయిన ముత్తయ్య, ఎస్‌కె.అబ్దుల్ నబీ, కన్నయ్య, రమేశ్, ఇస్రార్, హరినాథ్, బసవయ్య, సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, ఎస్‌కె.షాహిద్, దాశరథి, ఇల్లెందుల అప్పారావు, ఇల్లెందుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పాయం గెలుపునకు ప్రచారం

అశ్వాపురం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లును గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జామా మసీదు వద్ద కాంగ్రెస్ నాయకులు ముస్లింలను కలిసి మ్యానిఫెస్టోలో ముస్లిం మైనారిటీల డిక్లరేషన్‌ను వివరించి హస్తం గుర్తుపై ఓటు వేసి పాయం వెంకటేశ్వర్లును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్, నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, ఎస్‌కే.ఖధీర్, సదర్‌లాల్, చంద్రకళ, వలబోజు మురళి, కరుణ్‌కుమార్, గాలిబ్, భద్రారెడ్డి, వెంకట్‌లు పాల్గొన్నారు.

గోపయ్య-తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని అంకమ్మ తల్లి ఆలయంలో గోపయ్య, తిరుపతమ్మ వార్ల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కార్తీక మాసం క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం పురస్కరించుకుని ఆలయంలో అంకమ్మ తల్లికి అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాల నడుమ అమ్మ వారి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ప్రాంగణంలో శివసత్తుల విన్యాసాలు, భరత నాట్యాలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఈ కార్యక్రమంలో హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపకులు మారగాని శ్రీనివాసరావు,గుంపెన పీఏసీఎస్ చైర్మన్ బోయినపల్లి సుధాకర్, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన నిరుద్యోగం

భద్రాచలంటౌన్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కై ప్రజలను మభ్యపెట్టే విధానాలు, మోజపూరిత వాగ్దానాలతో గడిచిన పదేళ్లగా రాష్ట్రంలో నిరుద్యోగం, ధరలు పెరిగాయని, ఆ ప్రభావం నిరుపేదల జీవనంపై పడిందని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు ముసలి సతీష్ అన్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం నియోజకవర్గ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులను ఓడించాలని కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాయలంలో శుక్రవారం జరిగిన డివిజన్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని, ప్రైవేటును ప్రోత్సహించడంతో విద్య, వైద్య రంగాలు మూతపడే దశకు చేరుకున్నాయని విమర్శించారు. సమావేశంలో నరేష్, ప్రకాష్, రాజి, రమేష్, ఇమ్రాన్, సీతారాం పాల్గొన్నారు.

పాలియేటివ్ కేర్ వైద్య సేవలు..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు శుక్రవారం పాలియేటివ్ కేర్ వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, ఫిజియోథెరపీ సేవలు అందించారు. రోగుల కుటుంబసభ్యులకు వైద్య సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలియేటివ్ కేర్ వైద్యాధికారి డాక్టర్ రూప, డాక్టర్ ప్రదీప్, సీనియర్ ఏఎన్ఎం లలితకుమారి, నాగమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మెచ్చాకు నాయకపోటు(డు)!

అశ్వారావుపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు ఎన్నికల్లో నాయకపోడు సామాజిక వర్గం నుంచి వ్యతరేక తాకిడి తగిలేలా ఉంది. బీసీవై పార్టీ నుంచి పోటీ చేస్తున్న మనుగొండ వెంకటముత్యం రూపంలో ఆ వ్యతిరేకత కనిపిస్తోంది. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ మనుగొండ వెంకటముత్యం ఆదినుంచి టీడీపీ నాయకుడు. నారంవారిగూడెం గ్రామపంచాయతీలో తనకంటూ ఓ ప్రత్యేక క్యాడర్‌ను నిర్మించుకున్నారు. తుమ్మలతోనే నాడు బీఆర్ఎస్‌లో చేరాడు. ఉన్న కొద్దిగొప్ప నాయకపోడు ప్రజాప్రతినిధుల్లో గ్రామస్థాయిలో ఉన్న మనుగొండ వెంకటముత్యం ఒకడు. తుమ్మల అనుచరుడుగా నియోజకవర్గంలో పలుకుబడి ఉండనే ఉంది. చిట్టితల్లి స్వచ్ఛంద సేవా సమితి పేరుతో ఉచిత అంబులెన్స్‌లు నడుపుతున్నాడు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఈ ఎన్నికల్లో మెచ్చాకు పోటీగా బరిలో ఉన్నాడు.

ఇన్నాళ్లు ఇద్దరూ ఒకే పార్టీలో ఉన్నప్పటికీ మెచ్చాకు వ్యతిరేకంగా ఎన్నికల్లో ఢీకొట్టడానికి కారణాలు లేకపోలేదు. మనుగొండ వెంకటముత్యం గ్రామపంచాయతీ పరిధిలో ఓ యువకుడి ఆత్మహత్య విషయంలో నాడు నిందితుడిగా ఉన్నాడు. అతడి ఆత్మహత్యకు వెంకటముత్యమే కారణమంటూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ యువ నాయకుడు ప్రోత్బలంతో మృతుని బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సొంత పార్టీ సర్పంచ్ అని కూడా చూడకుండా తనపై తప్పుడు కేసు బనాయించి జైలు పాలు చేశారని మనుగొండ వెంకటముత్యం ఆరోపిస్తున్నారు. మొత్తంగా ఆ కేసు కాస్తా ముదిరి సర్పంచ్ వెంకటముత్యం జైలుపాలయ్యాడు.

తన సొంత పార్టీ ఎమ్మెల్యే తనను జైలు పాలు చేశాడనే విచారాన్ని తన వాళ్ల వద్ద బహిర్గత పరిచాడు వెంకటముత్యం. తన సామాజిక వర్గం నాయకపోడు ఓట్లు 13వేలకు పైగా ఉన్నాయి. అందరినీ కలుపుకుని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ తరుపున నామినేషన్ దాఖలు చేశాడు. తన గెలుపు కంటే మెచ్చా ఓటమి లక్ష్యంతో ప్రచార నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

వైభవంగా క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అహోబిల మఠం వేదికగా శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహోబిల మఠం ప్రధాన అర్చకుడు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి మాట్లాడుతూ.. సాగర మధనం నుంచి శ్రీ మహాలక్ష్మి అమ్మవారు ఆవిర్భావం చెందిన రోజునే ఈ క్షీరాబ్ది ద్వాదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 2 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించినట్లు పేర్కొన్నారు. వేద పండితులు శ్రీనివాస శర్మ, శ్రీధర్ శర్మ, పవన్, నవీన్, భక్తులు పాల్గొన్నారు.

చండీ హోమాలు..

చర్ల: మండల కేంద్రంలోని పాతచర్లలో ఉన్న ఉమా రామలింగేశ్వరాస్వామి దేవాలయంలో కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం రుద్ర హోమం, చండీయాగాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసంలోని ద్వాదశీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవి ఆరాధన, అస్తరాచార్చన, అమృత కలశ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విజయ పాశుపతి రుద్రయాగం, మహాచండీ యాగాలను నిర్వహించగా, 41 మంది దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


యాగం నిర్వహిస్తున్న వేద పండితులు